# దుబాయ్ డౌన్ టౌన్ పై డ్రోన్ దాడి..

### దుబాయ్ అల్ బదా నివాస ప్రాంతంపై డ్రోన్ దాడి

ఢిల్లీ: గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఉద్ధృతం చేస్తోంది. తాజాగా, దుబాయ్ సహా పలు గల్ఫ్ నగరాల్లో డ్రోన్ దాడులు, పేలుళ్లు సంభవించాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ప్రారంభించిన ఈ ప్రతిదాడులు ఇప్పుడు గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థను, భద్రతను కలవరపెడుతున్నాయి.

తాజా దాడులకు సంబంధించిన కొన్ని వివరాలు:

దుబాయ్ డౌన్ టౌన్ లోని అల్ బదా నివాస ప్రాంతంలో డ్రోన్ పేలుడు జరిగినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ దాడితో ఆకాశంలో పొగ మేఘాలు కమ్ముకున్నాయి. అయితే ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని దుబాయ్ మీడియా తెలిపింది. మరోవైపు దుబాయ్ క్రీక్ హార్బర్ ప్రాంతంలోని ఓ భవనాన్ని ఈ తెల్లవారుజామున ఒక డ్రోన్ ఢీకొట్టింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. దుబాయ్ తీరంలో ప్రయాణిస్తున్న ఒక కంటైనర్ షిప్ పై గుర్తుతెలియని క్షిపణి దాడి జరగడంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. షిప్పులోని సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ముహర్రాక్ ద్వీపంపై ఇరాన్ చేసిన దాడితో భారీ మంటలు చెలరేగాయి. జెట్ ఫ్యూయల్ ట్యాంకులు ఉన్న ప్రాంతం కావడంతో ప్రజలంతా కిటికీలు మూసివేసి ఇంట్లోనే ఉండాలని అధికారులు హెచ్చరించారు. కువైట్ లో ఒక నివాస భవనాన్ని ఇరాన్ డ్రోన్ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కువైట్ గగనతలాన్ని ఉల్లంఘించిన మరికొన్ని డ్రోన్లను తమ వైమానిక దళం కూల్చివేసినట్లు కువైట్ రక్షణ శాఖ తెలిపింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని డిప్లొమాటిక్ క్వార్టర్ (రాయబార కార్యాలయాల ప్రాంతం) లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను సౌదీ దళాలు కూల్చివేసాయి. అలాగే తూర్పు ప్రాంతంలోని షైబా చమురు క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకున్న మరికొన్ని డ్రోన్లను కూడా కూల్చివేసినట్లు సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

### యుద్ధం వల్ల అమెరికాకు భారీగా ఖర్చు..

# తొలి 6 రోజుల్లోనే లక్ష కోట్లు

ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు అగ్రరాజ్యం అమెరికాకు చమటలు పట్టిస్తున్నాయి. గత 12 రోజులుగా ఇరాన్‌పై చేస్తున్న దాడులకు అమెరికా మంచినీళ్లలా డబ్బు ఖర్చు చేస్తోంది. యుద్ధం మొదలైన మొదటి ఆరు రోజుల్లోనే డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఏకంగా 11.3 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. భారత కరెన్సీలో ఇది దాదాపు లక్ష కోట్ల రూపాయలకు పైమాటే. సెనేటర్లతో జరిగిన అంతర్గత సమావేశంలో రక్షణ శాఖ అధికారులు ఈ గణాంకాలను బయటపెట్టారు. గత నెల 28న యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే సుమారు 5.6 బిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక ఆయుధ సామగ్రిని అమెరికా ప్రయోగించింది. అయితే, క్షేత్రస్థాయిలో వాస్తవ ఖర్చు ఈ అంచనాల కంటే చాలా ఎక్కువగా ఉండొచ్చని సెనేటర్ క్రిస్ కూన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగే సూచనలు కనిపిస్తుండటంతో అదనపు నిధుల కోసం ట్రంప్ సర్కార్ వేట మొదలుపెట్టింది. త్వరలోనే మరో 50 బిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయించాలని కోరుతూ వైట్‌హౌస్ కాంగ్రెస్‌కు ప్రతిపాదనలు పంపనుంది. ఇప్పటికే అమెరికా రక్షణ శాఖ నిల్వలు నిండుకుంటున్నాయని, ప్రస్తుత యుద్ధం సైనిక శక్తిని మరింత కుంగదీస్తుందని కాంగ్రెస్ సభ్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇంధన సంక్షోభం తలెత్తకుండా చమురు నిల్వలను విడుదల చేసేందుకు కూడా అమెరికా సన్నాహాలు చేస్తోంది.

## అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం ఆగాలంటే..

## ఇరాన్ మూడు షరతులు!

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకడానికి ఇరాన్ మూడు కీలక షరతులను ముందుకు తెచ్చింది. ఒకవైపు శాంతి కోసం ప్రతిపాదనలు చేస్తూనే, మరోవైపు తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఆ దేశ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ షరతులను ప్రకటించారు. రష్యా, పాకిస్థాన్ దేశాధినేతలతో మాట్లాడిన తర్వాత ఆయన ఈ పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్, అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ముగించాలంటే ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో తమ దేశంపై మళ్లీ దాడులు జరగకుండా కఠినమైన అంతర్జాతీయ హామీలు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు షరతులకు అంగీకరిస్తేనే శాంతి సాధ్యమని ఆయన తేల్చిచెప్పారు. ఇరాన్ అధ్యక్షుడు శాంతి కోసం షరతులు విధిస్తున్న తరుణంలోనే ఆ దేశ సైన్యం నుంచి తీవ్ర హెచ్చరికలు వెలువడ్డాయి. ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి అబోల్ఫజల్ షెకార్చి ప్రభుత్వ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ అమెరికా తమ దేశంలోని పోర్టులపై దాడి చేస్తే, పర్షియన్ గల్ఫ్‌లోని ఏ ఒక్క పోర్టు, ఆర్థిక కేంద్రం, లేదా ఇతర ప్రాంతం సురక్షితంగా ఉండదని హెచ్చరించారు. "మా ఓడరేవులపై దాడులు జరిగితే, ఈ రీజియన్‌లోని అన్ని పోర్టులు, రేవులు మా చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతాయి" అని ఆయన పేర్కొన్నారు. అంతేగాక తమ పోర్టులపై దాడి జరిగితే ఇప్పటివరకు చేసిన దానికంటే చాలా భారీ స్థాయిలో సైనిక చర్య చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాంతంలోని దేశాలు తమ భూభాగాల నుంచి అమెరికన్లను తరిమికొట్టాలని కూడా షెకార్చి పిలుపునిచ్చారు. ఒకవైపు ఇరాన్ రాజకీయ నాయకత్వం శాంతి కోసం షరతులు పెడుతూనే, మరోవైపు సైనిక నాయకత్వం తీవ్రమైన పరిణామాల గురించి హెచ్చరించడం పశ్చిమాసియాలో నెలకొన్న సంక్లిష్ట, ఉద్రిక్త పరిస్థితికి అద్దం పడుతోంది.

# వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజలు సొత్తు

అమరావతి: 2021 మార్చి 12న ఆవిర్భవించిన వైసీపీ... 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు మిన్నంటాయి. జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో పార్టీ అధినేత జగన్ వైసీపీ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. పార్టీ భవిష్యత్తుపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. నల్లకాల్వలో ఇచ్చిన మాట కోసమే ఈ పార్టీ పుట్టిందని జగన్ గుర్తుచేశారు. తాను ఇచ్చిన ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశను, దిశను మార్చివేసిందని ఆయన అన్నారు. 2011 మార్చి 12న పార్టీ ఆవిర్భవించిందని... వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజల సొత్తు అని, మొదటి నుంచి తాను కేవలం ప్రజలను, దేవుడిని మాత్రమే నమ్ముకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు వైసీపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. వైసీపీ అభిమాని కాలర్ ఎగరేసేలా పార్టీ భవిష్యత్తు ఉంటుందని ఆయన కార్యకర్తల్లో ధైర్యం నింపారు. తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న ప్రతి గుండెకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైఎసీపీ శ్రేణులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. 2011లో స్థాపించబడిన ఈ పార్టీ, 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు, ఎక్స్ వేదికగా కూడా ఆయన భావోద్వేగపూరితమైన పోస్ట్ పెట్టారు. "నా ధైర్యం మీరే.. నా బలం మీరే. నాన్న గారి ఆశయ సాధన కోసం స్థాపించిన మన పార్టీని, నన్ను మీరు గుండెల్లో పెట్టుకున్నారు, భుజాలపై మోస్తున్నారు. కష్టకాలంలో వెనక్కి తగ్గకుండా పార్టీ కోసం నిలబడుతున్నారు. పార్టీపై నమ్మకం పెట్టుకుని, నాపై నమ్మకం ఉంచి పార్టీ కోసం నిలిచిన మీరే మన పార్టీకి అసలైన బలం.. నా బలం. మన పార్టీ ప్రస్థానం కేవలం ఒక రాజకీయ ప్రయాణం మాత్రమే కాదు. ఒక లక్ష్యంతో లక్షలాది మంది కార్యకర్తల కష్టం, నమ్మకం, త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు పేరు పేరునా శుభాకాంక్షలు" అని ట్వీట్ చేశారు.

## కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు

హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి ఈరోజు సీబీఐ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లిన సీబీఐ అధికారులు, ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరుతూ ఆమెకు సమన్లు అందజేశారు. ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందిని డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని కోర్టు అప్పట్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ట్రయల్ కోర్టులో ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించడంతో పాటు, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కవితకు సమన్లు అందించారు. ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "ఈరోజు మధ్యాహ్నం సీబీఐ అధికారులు నాకు నోటీసులు అందజేశారు. దీనిపై నా లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నాను. చట్టంపై నాకు నమ్మకం ఉంది. విచారణకు సంపూర్ణంగా సహకరిస్తాను" అని పేర్కొన్నారు.

## తెలంగాణ డీజీపీ రేసులో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ (డీజీపీ) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఢిల్లీలో జరిగిన యూపీఎస్సీ ఉన్నత స్థాయి కమిటీ భేటీలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో కూడిన ప్యానల్‌ను ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

### యూపీఎస్సీ సిఫార్సు చేసిన ముగ్గురు అధికారులు:

సీవీ ఆనంద్ (1992 బ్యాచ్): ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఆయన, సీనియారిటీలో అందరికంటే ముందున్నారు. మే 2028 వరకు ఆయనకు సర్వీస్ కాలం ఉంది. వినాయక్ ప్రభాకర్ ఆప్టే (1994 బ్యాచ్): ప్రస్తుతం సెంట్రల్ డిప్యుటేషన్‌లో ఐబీ జాయింట్ డైరెక్టర్‌గా విధుల్లో ఉన్నారు. డాక్టర్ సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్): ప్రస్తుతం హోమ్ గార్డ్స్ అండ్ ట్రైనింగ్ విభాగంలో డీజీగా సేవలు అందిస్తున్నారు. సీనియారిటీ, రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం పరంగా సీవీ ఆనంద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వినాయక్ ప్రభాకర్ ఆప్టే ఎక్కువ కాలం కేంద్ర సర్వీసుల్లో ఉండటం, రాష్ట్ర ప్రభుత్వం కూడా సీనియారిటీకి ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆనంద్‌కే డీజీపీ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే సౌమ్య మిశ్రా పేరు కూడా పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేస్తూ మరో రెండు మూడు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. కాగా, ప్రస్తుత డీజీపీ బి. శివధర్ రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనున్నారు.

### పర్యాటకానికి పారిశ్రామిక హోదా..

# అమరావతిలో క్రియేటివ్ సిటీ

మొదటి పేజి తరువాయి

అభివృద్ధి ప్రణాళికలకు అటవీ శాఖ అధికారులు సహకరించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, వారి తీరు మారాలని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

పర్యాటకానికి పెద్దపీట.. అమరావతిలో క్రియేటివ్ సిటీ

ఏపీలో పర్యాటక రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులను సిద్ధం చేయాలని, హోమ్ స్టేలను ప్రోత్సహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రకటించారు. పాపికొండలు, సూర్యలంకను మరో గోవాలా, గండికోటను భారత్‌కే గ్రాండ్ కాన్యన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. తిమ్మమ్మ మర్రిమాను, కంభం చెరువు వంటి చారిత్రక ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించి పర్యాటకులను ఆకర్షించాలని సూచించారు. కంటెంట్ క్రియేషన్‌ను ప్రోత్సహించేందుకు అమరావతిలో ఒక 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేస్తామని, ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్దపీట వేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

అటవీ శాఖపై తీవ్ర అసంతృప్తి

అభివృద్ధి పనులకు అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. "పోలీస్ డిపార్ట్‌మెంట్ పీపుల్ ఫ్రెండ్లీగా మారింది కానీ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ మారలేదు. నాలుగోసారి సీఎంగా చేస్తున్నా, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి అటవీ శాఖపై ఫిర్యాదులు వస్తున్నాయి" అని అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీశైలంలో భక్తులను అడ్డుకోవడం, బద్వేలులో ప్రాజెక్టులకు ఆటంకాలు కల్పించడం వంటి సంఘటనలను ప్రస్తావించారు. అటవీ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ల కిందే పనిచేయాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, నిబంధనలకు లోబడి పర్యావరణహిత ప్రాజెక్టులకు సహకరించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అడ్డుపడవద్దని స్పష్టం చేశారు.

మౌలిక వసతులు, పరిశ్రమలే లక్ష్యం

రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. హిందూపురం వద్ద ఎలక్ట్రానిక్స్ సిటీ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు. స్టార్టప్‌లు, యువతలోని వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను మరింత క్రియాశీలం చేయాలన్నారు. జిల్లాల్లో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, తలసరి ఆదాయం పెంపుపై కలెక్టర్లు దృష్టి సారించాలని, వారి పనితీరును సమీక్షిస్తామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటును సులభతరం చేసేందుకు, 5 ఎకరాల వరకు ఏపీఐఐసీ భూ కేటాయింపుల అధికారాన్ని కలెక్టర్లకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

మొదటి పేజి తరువాయి

ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు. పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు. ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు. తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.

### వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

మొదటి పేజి తరువాయి

వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది?

మొదటి పేజి తరువాయి

అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీ వేదికగా నిలదీస్తాం

మొదటి పేజి తరువాయి

వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యలను సభ ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకెళ్తానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి, కార్మికులకు అన్యాయం చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకవైపు ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ శక్తులకు అప్పగించి, వారికే సబ్సిడీలు ఇస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నారు. జీరో టికెట్ అమలు కోసం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు అరకొర నిధులు చెల్లించి చేతులు దులుపుకోవడం శోచనీయం.

## జిల్లాలను ప్రమోట్ చేయండి... పెట్టుబడులను ఆకర్షించండి: కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం కేవలం సంబంధిత శాఖల పనే కాదని, ఇకపై జిల్లా కలెక్టర్లు కూడా పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడిదారులను గుర్తించి, ఒప్పించి, వారికి అన్ని విధాలా సహకరించేందుకు 'కమిట్‌మెంట్, కన్విన్స్, కో-ఆపరేట్' అనే 3సీ ఫార్ములాను ఆయన నిర్దేశించారు. పెట్టుబడుల విషయంలో కలెక్టర్ల పనితీరును అంచనా వేసి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఆధారంగా ర్యాంకులు ఇస్తామని ప్రకటించారు. అమరావతిలో జరిగిన 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెండో రోజు పెట్టుబడులు, పర్యాటక రంగాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "పెట్టుబడులు వస్తేనే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రజల తలసరి ఆదాయం వృద్ధి చెందుతుంది. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు వేగంగా కార్యరూపం దాల్చేలా చూడాలి. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ప్రత్యేక అధికారులకు అప్పగించాం.

## 'గ్యాస్ బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోండి'

మొదటి పేజి తరువాయి

గ్యాస్ కొరత కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా గ్యాస్ బ్లాక్ మార్కెట్ కారణంగానే ఈ పరిస్థితి వచ్చినట్లు కనబడుతోందని, ఈ బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు కేటీఆర్. ఈ మేరకు సిలిండర్ల తీవ్ర కొరతను పరిష్కరించడానికి వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాశారు. ఎల్పీజీ సిలిండర్ లభ్యతపై పారదర్శక సమాచారాన్ని అందించడానికి రియల్-టైమ్ పబ్లిక్ డాష్‌బోర్డ్‌ను రూపొందించాలని ఆయన సిఫార్సు చేశారు చిన్న వ్యాపారాలపై అదనపు ఆర్థిక భారాన్ని నివారించడానికి వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లపై తాత్కాలిక ధరను నిర్ణయించి దానిని అమలు చేయాలన్నారు.

## తెలంగాణలో ఈ నెల 16 నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్: తెలంగాణలో మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ పాఠశాలలన్నింటికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. మధ్యాహ్న భోజనం సరిగ్గా మధ్యాహ్నం 12.30 గంటలకు పెడతారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఆ క్లాసుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న స్కూళ్లు.. పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. పరీక్షలు లేని రోజుల్లో పరీక్షా ఆ స్కూళ్లు కూడా యథావిధిగా ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు పనిచేయాలి. ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులకు (ఇజూం) డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు.

## నా ధైర్యం మీరే .. నా బలం మీరే : వైఎస్ జగన్

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'నా ధైర్యం మీరేడనా బలం మీరేడనాన్న గారి ఆశయ సాధన కోసం స్థాపించిన మన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని, నన్ను మీరు గుండెల్లో పెట్టుకున్నారు, భుజాలపై మోస్తున్నారు. కష్టకాలంలో వెనక్కి తగ్గకుండా పార్టీ కోసం నిలబడుతున్నారు. పార్టీపై నమ్మకం పెట్టుకుని, నాపై నమ్మకం ఉంచి పార్టీ కోసం నిలిచిన మీరే మన పార్టీకి అసలైన బలం.. నా బలం. మన పార్టీ ప్రస్థానం కేవలం ఒక రాజకీయ ప్రయాణం మాత్రమే కాదుడఒక లక్ష్యంతో లక్షలాది మంది కార్యకర్తల కష్టం, నమ్మకం, త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు పేరు పేరునా శుభాకాంక్షలు.' అని పేర్కొన్నారు. మన పార్టీ ఆవిర్భవించి ఈరోజుకు 15 ఏళ్లు పూర్తి. 2011, మార్చి 12న పుట్టిన మన పార్టీ, ఈరోజుకి 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇంకా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేది దేశంలోనే ఒక మార్క్‌గా నిల్చింది.

### గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారుగ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## జగన్ డీఎన్ఏలోనే అబద్ధాలు

మాజీ సీఎం జగన్ చెప్పినవి కాగ్ లెక్కలు కావని, ఆయన బెంగళూరు టీం ఇచ్చిన లెక్కలని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ చేసిన ఆర్థిక విధ్వంసాన్ని కాగ్ నివేదికలు కూడా స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. అలస్యంగా అయినా అబద్ధాలు ఎక్కువ, నిజం తక్కువ అంశాలతో ఆయన ప్రెస్‌మీట్ పెట్టారని అన్నారు. "తాను చేసిన ఆర్థిక విధ్వంసాన్ని కూటమి ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేశారు. బాధితుల్ని నిందితులుగా చేయడం జగన్ మార్క్ రాజకీయం. బాబాయ్ హత్యలో కూడా ఇలాగే సొంత చెల్లిని నిందితురాలిగా చేయాలని చూశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని కాగ్ స్పష్టం చేసింది. ఆ నివేదికను జగన్ చదవాలి. ఇంత దరిద్రమైన రిపోర్టు దేశ చరిత్రలో ఎప్పుడూ రాలేదు. జగన్ డీఎన్ఏలోనే అబద్ధాలు ఉన్నాయి. 2 గంటలు ప్రెస్‌మీట్ పెట్టి అన్నీ అబద్ధాలే చెప్పారు.

# నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను నిర్వహించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని...నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయం కూడా ఈ మహానగరం నుంచి కొనసాగించాలి' అని సీఎం అభిలషించారు. దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోను ముఖ్యమంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఐలైన్ స్టూడియో ప్రారంభంతో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మకమైన మార్పులకు ఈ స్టూడియో వేదిక కానుంది అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ వచ్చేసింది

'ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ తరుణం వచ్చేసింది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సరిపడా పరిమాణంలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ కోసం స్థలం కేటాయిస్తాం. అవసరమైతే నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు రిలొకేట్ చేయాలి'అని సీఎం రేవంత్ రెడ్డి రిక్వస్ట్ చేశారు. 'ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ నుంచి టెక్నోకలర్, అక్కడి నుంచి ఈస్ట్‌మన్ కలర్, తర్వాత 70 ఎంఎం, డాల్బీ, అక్కడి నుంచి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతం టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్ కూడా రావాలని మొదటి నుంచి బలంగా కాంక్షిస్తున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి తన మనసులో మాట బయటపెట్టారు.

నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ రెండూ గేట్‌వేలు

'ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్‌లో ఏర్పాటు కావాలన్నది మా ఆకాంక్ష. 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. మీ పెట్టుబడులకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుంది'అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. 'నెట్‌ఫ్లిక్స్ ప్రపంచానికి వినోదం అందించాలని చూస్తోంది. మేం ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని చూస్తున్నాం. మీకూ మాకు మధ్యన సారూప్యత ఉంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ ప్రపంచంలోని అన్ని సంస్కృతులను ప్రజలను ఆహ్వానిస్తుంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ రెండూ గేట్‌వేలుగా పనిచేయడానికి దోహదపడుతాయి'అన సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

### ఓటీటీలో ప్రపంచ లీడర్‌గా నెట్‌ఫ్లిక్స్

'ప్రపంచవ్యాప్తంగా వీక్షకుల కోసం ట్యాలెంట్, కంటెంట్‌ను నెట్‌ఫ్లిక్స్ అందిపుచ్చుకుంటే, హైదరాబాద్ అవకాశాలు, ప్రపంచ నైపుణ్యతను కలిగి ఉంది. మనం వారధి లాంటివాళ్లం. మార్పును ఆశించే వాళ్లం'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'డీవీడీలను అద్దెకు సమకూర్చే స్థాయి నుంచి ఓటీటీలో ప్రపంచ లీడర్‌గా నెట్‌ఫ్లిక్స్ ఎదిగింది. ఫుడ్, ట్రావెల్, వారసత్వం, సంస్కృతి విషయాల్లో ప్రజలు నెట్‌ఫ్లిక్స్‌ను, హైదరాబాద్‌ను ప్రేమిస్తారు. ప్రపంచ వీక్షకులకు తెలంగాణను విశ్వవ్యాప్తం చేయడంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ ఫెసిలిటీ ఎంతో ఉపయోగపడుతుంది'అని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. 'నెట్‌ఫ్లిక్స్ ఈ మధ్య కాలంలో స్పోర్ట్స్‌పై దృష్టిని సారించింది. స్పోర్ట్స్‌లో ఈ సంస్థ అతిపెద్ద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ కాబోతుంది'అని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

నెట్‌ఫ్లిక్స్‌కు సంపూర్ణ సహకారం అందిస్తాం

'తెలంగాణ ప్రభుత్వం కూడా అన్ని స్థాయిల్లో ట్యాలెంట్‌ను గుర్తించాలన్న లక్ష్యంతో క్రీడల పట్ల, క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. మీకూ మాకూ ఎంతో సారూప్యత కలిగిన నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ - హైదరాబాద్ రెండూ కలిసి మంచి విజయాలను సాధించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. 'నెట్‌ఫ్లిక్స్‌కు తెలంగాణ స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తాం. భారత్, తెలంగాణ భవిష్యత్తులో ప్రపంచస్థాయి వినోదాన్ని అందిస్తాయనడానికి ఈ కార్యక్రమమే ఒక నిదర్శనం. మనం కలిసి భవిష్యత్తుపై బలమైన ముద్ర వేద్దాం' అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, సినీ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవల్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో పాటు నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ నిధులను సద్వినియోగం చేసుకోండి

అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు బలమైన ఆధారం.

రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం -- సింగిల్ విండో అధ్యక్షుడు వేణుగోపాల్.

అన్నదాతల సంక్షేమానికి అన్నదాత సుఖీభవ పథకం కీలకం.

పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ నిధులు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట -- అప్పా వేణుగోపాల్.



**తుగ్గలి మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి మూడో విడతలోనూ లబ్ధి చేకూరుస్తున్నట్లు ఉప్పర్లపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఉప్పర్లపల్లి గ్రామంలో ఈ పథకాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం వారి ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడటమే కాకుండా వ్యవసాయ రంగం అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని అన్నారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం అందించడం ద్వారా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన సొంత భూమి కలిగి ఉన్న రైతు కుటుంబాలు, అటవీ హక్కుల గుర్తింపు భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా ఈ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందుతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద సంవత్సరానికి రూ.6,000 అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అదనంగా రూ.14,000 చొప్పున అందించి మొత్తం ఏడాదికి రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ నిధులను రైతులు వ్యవసాయ అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలా మనోహర్, విద్యా కమిటీ చైర్మన్ కంబగిరి, వ్యవసాయ సిబ్బంది వెంకటేశు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 3వ విడత నిధుల జమ నియోజవర్గంలో30 వేల 820 రైతులకు 17 కోట్ల 42 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**కాకినాడ జిల్లా కిర్లంపూడి మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రైతన్న నీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఏడిఏ దైవకుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారిని సుధా మాధురి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికిముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. రైతులకు 17 కోట్ల 42 లక్షల రూపాయల నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత వైసీపీ పాలనలో రైతులు అనేక విధాలుగా మోసపోయారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సభలను ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రైతులు వీక్షించారు. అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం కింద మూడో విడతలో ఒక్కో రైతుకు రూ.6,000 చొప్పున జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 30,820 మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.17.42 కోట్ల రూపాయలు జమ అయినట్లు ఆయన తెలిపారు. రైతులకు సాగు పెట్టుబడికి ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని, అందుకే కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తూ రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఏలేరు ఆధునికరణకు కట్టుబడి ఉన్నానని దాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, వీరం రెడ్డి కాశి బాబు, కందుల చిట్టిబాబు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, చదరం చంటిబాబు, పిల్లా చంటిబాబు, అడబాల భాస్కరరావు, గుడాల శ్రీలత రాంబాబు, తూము కుమార్, కుర్ల చిన్నబాబు, కాళ్ళ వెంకటేష్, బిజెపి నాయకులు శరకణం రాజబాబు, జనసేన నాయకులు, మూడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ఎస్ నరసింహ, జయలక్ష్మి, పి రాజేశ్వరి, ఏఈవోలు, వి ఏలు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

# ఇండియా కిక్ బాక్సింగ్ స్టేట్ లెవెల్ పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించిన డాక్టర్ చల్లా, సలాది



**ఆలమూరు,మార్చి 13(అఖండ భూమి న్యూస్):**పంచ్ పడితే పథకం ఖాయం.ఇటీవల జరిగిన అస్మిత కే లో ఇండియా కిక్ బాక్సింగ్ స్టేట్ లెవెల్ పోటీల్లో పథకాలు సాధించిన ఆలమూరు వారియర్ మాంక్స్ కుంగ్ ఫు విద్యార్థులు పలు పథకాలు సాధించినట్లు కోచ్ అండ్ మాస్టర్ లంకే వెంకటరెడ్డి తెలిపారు. ఈనెల 5వ తారీఖు నుంచి ఎనిమిదో తారీకు వరకు కర్ణాటక బెంగళూరులో నింజారా స్టేడియంలో జరిగిన సౌత్ ఇండియా నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆలమూరు వారియర్ మాంక్స్ కుంగ్ ఫు విద్యార్థులు 32కేజీల క్యాటగిరిలో జొన్నాడ శ్రీ సత్యం కాన్వెంటులో ఆరవ తరగతి చదువుతున్న కర్రీ బాల శ్రీ నందిని బ్రాంజ్ మెడల్, 36కేజీల క్యాటగిరిలో రావులపాలెం శ్రీ నక్షత్ర స్కూల్లో చదువుతున్న తలాటం శ్రీమానస్వి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వీరు ఈనెల26 నుంచి 29 వరకు తమిళనాడు చెన్నైలో జరగబోయే కే లో ఇండియా నేషనల్ పోటీలకు అర్హత సాధించారు. వీరిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు,కొత్తపేటకు చెందిన కాపు ఉద్యమ నాయకుడు సలాది రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా సలాది రామకృష్ణ మాట్లాడుతు పథకాలు సాధించిన విద్యార్థులు రాబోయే కాలంలో జాతీయ స్థాయిలో బాగా రాణించాలని, మన ఆంధ్రప్రదేశ్ కి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.అలాగే వారియర్ మాంక్స్ కుంగ్ ఫు ఫౌండర్ లంకే వెంకటరెడ్డి, సీనియర్ మాస్టర్ నార్గని సెంథిల్ కుమార్,అసిస్టెంట్ కోచ్ పి నానిబాబు, చింతా చిరంజీవి,మల్లాడి శ్రీను, కళ్యాణ్, సురేష్ కూడా వీరిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలమూరు శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం సెక్రటరీ ఎలుగుబంటి సాయిబాబా, ఆంధ్రప్రదేశ్ ఐక్య కాపునాడు ఆలమూరు మండలం ప్రెసిడెంట్ గొర్రిపూడి పెదకాపు,పంచాయితీ బోర్డు మెంబర్లు ఎలుగుబంటి బ్బూరయ్య,ఎరుకొండ గణేష్,శ్రీ భట్టి విక్రమార్కేశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మెన్ శ్రీపతి వీర్రాజు,ప్రముఖ వ్యాపారవేత్త వెత్సా శ్రీనివాసు,రావూరి శివ,గుబ్బల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## సంజీవనగర్ పైపు లైన్ల మరమ్మతు

పనులను పరిశీలించిన.: మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



**చిలకలూరిపేట మార్చి 13 (అఖండ భూమి న్యూస్);** స్థానిక సంజీవ నగర్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో కలుషిత నీరు కలసి సరఫరా అవుతుందని స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో అప్రమత్తమైన మున్సిపల్ యంత్రాంగం పైపులైన్ లీకేజీలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న మరమ్మతు పనులను శుక్రవారం నాడు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని,నీటి సరఫరా మరియ పంపిణీ వ్యవస్థను మున్సిపల్ డి,ఈ,అబ్దుల్ రహీం, కమిషనర్ పీ శ్రీహరిబాబు లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని నీటి సరఫరాలో ఏదైనా అంతరాయం సంభవించినప్పుడు పుర ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ అబ్దుల్ రహీం,పదో వార్డు కౌన్సిలర్ మౌలాలి, ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ అల్తాఫ్ లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర వ్యాయామవిద్య అధికారి..



**యర్రగొండపాలెం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర వ్యాయామవిద్యా అధికారి శ్రీ యస్ కె.మహబూబ్ భాషా గారు సందర్శించారని ప్రధానోపాధ్యాయులు యం.డి ఖాశిం తెలిపారు తనిఖీలో భాగంగా పాఠశాలలోని స్కౌట్స్&గైడ్స్ అలాగే యన్.సి.సి విద్యార్థులు స్వాగతం పలికారని అలాగే పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యాయామవిద్యా కార్యక్రమాలను మార్నింగ్ అసెంబ్లీ ఆటస్థలం వినియోగం రికార్డులు,రిజిష్టర్లు నిర్వహణ తనిఖీ చేసి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తుల్లిబిల్లి.త్రినాథ్,పి.మ్యాథ్యూలకు మార్గ నిర్దేశం చేశారని విద్యార్థులకు క్రమశిక్షణ అలవరచడంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులే కీలకమని క్రమశిక్షణ ఉన్నప్పుడే చదువుపై దృష్టి సారించగలరని అన్నారన్నారు.అలాగే పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తుల్లిబిల్లి.త్రినాథ్ విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచడమే భాగంగా స్కౌట్స్ మరియు యన్.సి.సి బాధ్యతలను నిర్వర్తించడం కూడా అభినందనీయమన్నారు తదుపరి యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు వృత్తి పరమైన అంశాల నిర్వహణపై క్షేత్ర స్థాయిలో సమావేశం నిర్వహించి విధివిధానాలను అమలు చేయడంలో ఖచ్చితత్వం పాటించాలని తెలియజేశారన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతోపాటు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు.

## ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాం

ఘనంగా 10వ తరగతి వార్షికోత్సవ వేడుకలు

ప్రధానోపాధ్యాయులు ఎస్ సంధ్య, దర్శి సత్యనారాయణ






**మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాం చదువులమ్మ చెట్టు నీడలో అంటూ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. మండలంలో పి మాకవరం కొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పి మాకవరం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ సంధ్య కొమ్మిక ప్రధానోపాధ్యాయుడు దర్శి సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ను ధైర్యంగా ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా వివిధ మెలకువలు తెలియజేశారు. విద్యార్థులు తమ జీవితాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసి మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు అలాగే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నప్పుడే వారి భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా మారుతుందని ఉద్భోధ చేశారు. ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు 10వ తరగతి పరీక్షల మూల ఆధారమని వివరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లు సర్పంచులు పాల్గొన్నారు


## కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల అభ్యున్నతికి వారి ఉద్యోగ కల్పనలు ఎన్నో అవకాశాలు కల్పిస్తుంది. మాజీమంత్రి ప్రత్తిపాటి.

కిట్స్ అక్షర్ ఇన్స్టిట్యూట్ నిర్వహిస్తున్న యూత్ ఫెస్ట్ ప్రారంభించిన ప్రత్తిపాటి.



**చిలకలూరిపేట మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** గుంటూరు కొండ్రుపాడు లోని కిట్స్ అక్షర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2 రోజుల గాలస్ యూత్ ఫెస్ట్ కు ముఖ్య అతిథిగా మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యతోనే ఉన్నత స్థానం సాధించగలుగుతారు అని ప్రత్తిపాటి అన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల అభ్యున్నతికి వారి ఉద్యోగ కల్పనలు ఎన్నో అవకాశాలు తెస్తుందని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలని ఈగల్ టీంలు పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో చేస్తున్నారన్నారు. ఐ.ఏ.ఎస్, ఐపీఎస్, ఐటీ, టెక్నాలజీ రంగాలలో ముందుకు వెళ్లే విధాగం ఉండాలని సోషల్ మీడియాకు దూరంగా ఉండటం చాలా ఉత్తమం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అకే రవికుమార్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కళాశాల చైర్మన్ సుబ్బారావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, కళాశాల డైరెక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామకొండ మాజీ సర్పంచ్ వెంకటేష్ కన్నుమూత



**తుగ్గలి మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని రామకొండ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వెంకటేష్ (65) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఉండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ సర్పంచ్ వెంకటేష్ గ్రామంలో హార్మోనిస్టుగా పనిచేస్తూ పలువురు కళాకారులను తీర్చిదిద్దిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. అదేవిధంగా ఆర్ఎంపి వైద్యునిగా కూడా సేవలందిస్తూ గ్రామ ప్రజలకు వైద్య సహాయం అందించారు.ఆయన మరణం పట్ల రామకొండ గ్రామ ప్రజలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించగా, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని నివాళులు అర్పించారు. వెంకటేష్ మృతి గ్రామానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

## తెలుగు సాహిత్యానికి చిరస్థాయి కీర్తి తెచ్చిన మొల్లా కవిత్వం

-- ఎంపీడీఓ ఏ. రాజు



**ఆలమూరు,మార్చి 13(అఖండ భూమి న్యూస్):**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలుగు తొలి కవయిత్రి మొల్లా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఏ. రాజు మాట్లాడుతూ మొల్లా తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గొప్ప కవయిత్రి అని అన్నారు. ఆమె రచించిన మొల్లా రామాయణం తెలుగు సాహిత్యంలో అమూల్యమైన గ్రంథమని పేర్కొన్నారు. సులభమైన, సరళమైన తెలుగు భాషలో రామాయణ కథను ప్రజలకు అర్థమయ్యే విధంగా అందించిన మహత్తర కృషి మొల్లాదని తెలిపారు. ముఖ్యంగా ఆమె రచనల్లో భక్తి, నైతిక విలువలు, సాంప్రదాయాల ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు. రాజులు, పండితులు మాత్రమే సాహిత్యం రాయగలరనే భావనను చెరిపేసి సాధారణ ప్రజలకు కూడా సాహిత్యాన్ని చేరువ చేసిన గొప్ప కవయిత్రి మొల్లా అని కొనియాడారు. ఆమె రచనలు తెలుగు భాషకు గౌరవాన్ని తీసుకువచ్చాయని, నేటి తరానికి కూడా స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొని మొల్ల సేవలను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

## అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మూడవ విడత నిధులు విడుదల



**దేవనకొండ, మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్" పథకం మూడవ విడత నిధులను ఈరోజు విడుదల చేసింది. ఇందులో భాగంగా దేవనకొండ మండలంలోని రైతులకు లబ్ధి చేకూరుస్తూ స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.దేవనకొండ మండలంలోని 15 రెవిన్యూ గ్రామాలకు చెందిన 15,220 మంది రైతులు,?విడుదలైన నిధులు మొత్తం 8.55 లక్షల రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.ఈ సందర్భంగా మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, అన్నదాతలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకే ఈ నిధులను సకాలంలో విడుదల చేస్తోందని కొనియాడారు.??ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఉషారాణి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగుడు, ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సరోజ, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, ఆకుల వీరేష్, రాజు, గోపాల్ గౌడ్, కాకర్ల శాంత కుమార్ పాల్గొన్నారు.?అలాగే జనసేన నాయకులు ఉచిరప్ప, రామాంజనేయులు, యూసుఫ్ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది ఏఈఓ రంగన్న, మల్లికార్జున, సచివాలయ సిబ్బంది, వి ఏ ఓ లు హసీనా, కళావతి తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## ధర్మసాగరంలో ఘనంగా 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'.. రైతుల ఖాతాల్లోకి నగదు జమ



**మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ఈ పథకం మూడవ విడత నిధుల పంపిణీని స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా రైతులకు లబ్ధిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, వ్యవసాయ పెట్టుబడికి ఈ నగదు రైతాంగానికి ఎంతో ఆసరాగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రామారావు, జడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, శ్రీ రంగస్వామి, నర్సీపట్నం మండలం టీడీపీ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 16న రంజాన్ తోఫా పంపిణీకి సీఐ కే అజయ్ కుమారును ఆహ్వానించిన ఇస్మాయిల్




**ఎర్రగొండపాలెం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** శుక్రవారం రోజు యర్రగొండపాలెం పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ క్వార్టర్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. అజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 16 న యర్రగొండపాలెం పట్టణంలో జరగనున్న రంజాన్ తోఫా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించిన నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు,ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ షేక్.ఇస్మాయిల్

## మూడో విడత అన్నదాత సుఖీభవ



**పుల్లల చెరువు మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** పుల్లలచెరువు మండలం ఐటివరం గ్రామపంచాయతీలో శుక్రవారం నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు పొట్ల గోవింద్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఏపీలో కూటమి ప్రభుత్వం రైతన్నలకు అన్నదాత సుఖీభవ నిధుల్ని ఇవాళ జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ లో భాగంగా రైతులకు ఇవాళ ఈ సాయం విడుదల అయినందుకు. ఈ పథకం మూడవ విడతగా మొత్తం 46.85 లక్షల మందికి కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.6వేలు జమ అవుతాయి. మూడో విడత కోసం రూ.2,676 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఖర్చు చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర వాటా రూ.1,874 కోట్లు. ఇప్పటికే రెండు విడతల్లో మొత్తం రూ.14 వేలను ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో జమ చేశాయి. ఇవాళ ఇచ్చే రూ.6 వేలతో కలిపి రైతులకు ఇచ్చిన హామీ ఏడాదికి రూ.20 వేల సాయం పూర్తి కానుంది. ఇచ్చిన మాట ప్రకారం మూడో విడత అన్నదాత సుఖీభవ డబ్బులు పడినందుకు ఐటివరం గ్రామ రైతులు ప్రజలు అందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు అని పొట్ల గోవిందు అన్నారు.. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లపాటి ఏడుకొండలు సచివాలయం సిబ్బంది అదేవిధంగా గ్రామ పెద్దలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

## ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించాలని ఎరిక్షన్ బాబుకు జర

ప్రెస్ క్లబ్ సభ్యులు వినతి

ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించాలని తహసీల్దార్ డి మంజునాథ రెడ్డికు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతి




**యర్రగొండపాలెం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం మండలంలో విలేఖరులుగా పనిచేస్తున్న వారి కోసం యర్రగొండపాలెం పట్టణంలో ప్రెస్ క్లబ్ నిర్మించుకునేందుకు 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ద్వారా తహసీల్దార్ డి మంజునాథ రెడ్డికు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతి పత్రం సమర్పించారు.యర్రగొండపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ జరుగుగా ప్రెస్ క్లబ్ సభ్యులు ఎరిక్షన్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రెస్ క్లబ్ లేని కారణంగా విలేఖరులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అసౌకర్యంగా ఉందన్నారు. అందువల్ల ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు.అలాగే విలేఖరులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎరిక్షన్ బాబు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పఠాన్ రసూల్ ఖాన్,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి చిన్న యేసేబు,మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు షేక్ బాజీ,కార్యవర్గ గౌరవ అధ్యక్షులు షేక్ మాబువలి,99 టివి,గౌరవ సలహాదారులు మందా ఆదాం, డి-8టివి, ఉపాధ్యక్షులు రామావత్ శంకర్ నాయక్, సాక్షి టివి, డోలు శ్రీకాంత్, హెచ్ఎమ్ టివి, తప్పెట్ల కోటేశ్వరరావు, దిశ, సహాయ కార్యదర్శులు గర్నేపూడి కోటేష్ ఆంధ్రప్రభ, గుంటి రాము, భారత్ టూడే టివి, క్రమశిక్షణ సంఘం సభ్యులు చింతగుంట్ల మల్లికార్జున, ఏబీఎన్,మీడియా ఇన్చార్జిగా అవుల ఏసు బాబు, అఖండ భూమి, కార్యవర్గ సభ్యులు తంగిరాల మధుసూధనరెడ్డి, ఐ న్యూస్, దగ్గుల శివ కృష్ణారెడ్డి,సుమన్ టివి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు

యర్రగొండపాలెం ఆర్సి ఇంచార్జి




**మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి శ్రీశ్రీశ్రీ ఆత్రేయపురం మొల్లమాంబ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో మొల్లమాంబకి విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు. మహిళలు కూడా సాహిత్య రంగంలో గొప్ప కృషి చేయగలరని మొల్లమాంబ తమ రచనల ద్వారా నిరూపించారని అన్నారు. ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. ఇలాంటి మహనీయుల జీవితం యువతకు ఆదర్శమని, వారి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మొల్లమాంబ సేవలు తెలుగు భాషా అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని కొనియాడారు. ఆమె సాహిత్య కృషి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో చేకూరి సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి చెవుల అంజయ్య,పెరుమాళ్ళ మల్లికార్జున రావు,మంత్రు నాయక్,కేసనపల్లి మల్లికార్జున,వెంకట కోటయ్య,తోట మహేష్ నాయుడు,కొత్తమాసు సుబ్రహ్మణ్యశ్రీ ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మార్కాపురం జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవల్లి రామయ్య గారు ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సొసైటీ చైర్మన్ యాపర్తి వీరయ్య జనరల్ సెక్రెటరీ డాక్టర్ బట్టపోతుల వెంకటేశ్వర్లు మారపాకుల రాంబాబు వరికల పోలయ్య రాజారపు వెంకట్రావు మారుపాకుల అంజి బంగ్లా సుబ్బయ్య పోకూరి సుబ్రహ్మణ్యం పోకూరు వెంకటేశ్వర్లు మూఢమంచు బాలయ్య గ అధికార ప్రతినిధి శిఖరం సుబ్బారావు, పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



**జి.మాడుగుల, మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. నాగరాజు, చైర్మన్ ఎల్. రామకృష్ణ ఆధ్వర్యంలో జి.మాడుగుల ఆటో యూనియన్ సభ్యులు సహకారంతో 24 మంది పదో తరగతి విద్యార్థులకు ప్లాంక్‌లు, పెన్సిళ్లు, రబ్బర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి నుంచి విద్యార్థులు మరింత శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. నాగరాజు, ఉపాధ్యాయులు, ఆటో యూనియన్ సభ్యులు కొర్ర, చిన్నబ్బాయి (చిన్న), పండన్న, హేమసుందర్, సింహాచలం, సత్యనారాయణ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి

జొన్నగిరి గ్రామంలో త్రాగునీటి పథకాల పరిశీలన.



**తుగ్గలి మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** తుగ్గలి మండలంలోని అతిపెద్ద గ్రామమైన జొన్నగిరిలో రానున్న వేసవి కాలంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు పత్తికొండ డివిజన్ ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఖాన్, మండల ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ మయాంక్ శుక్రవారం జొన్నగిరి గ్రామంలో పలు త్రాగునీటి పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు మిద్దె వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ గతంలో వేసవి కాలంలో జొన్నగిరి గ్రామంలో తరచుగా త్రాగునీటి సమస్యలు ఎదురయ్యేవని తెలిపారు. అయితే ఈ సంవత్సరం అలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఖాన్ మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామ ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని నీటి పథకాలను పరిశీలించామని తెలిపారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని గ్రామపంచాయతీ అధికారులకు సూచనలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి కుమార్ యాదవ్, టిడిపి నాయకులు సంఘాల బాలన్న, మీసాల శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గొలుగొండలో ప్రజావేదిక భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

-రైతులు, ప్రజల నుంచి విన్నపాలు స్వీకరణ

-పారదర్శకంగా సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల హామీ



**గొలుగొండ మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** గొలుగొండ తహశీల్దార్ కార్యాలయంలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, సామాన్య ప్రజలు భూ వివాదాలు, మ్యుటేషన్లు మరియు ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలపై తమ విన్నపాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కాకర నూకరాజు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా సరిహద్దు వివాదాలు, భూ రికార్డుల సరిదిద్దుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. గొలుగొండ ఎస్ఐ రామారావు మాట్లాడుతూ భూ తగాదాల కారణంగా శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలని కోరారు. అలాగే ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ మరియు మండల పరిషత్ సమన్వయంతో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజనుల భూ సమస్యలపై అర్జీల వెల్లువ



**రంపచోడవరం, మార్చి 13;(అఖండ భూమి న్యూస్)** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గిరిజన ప్రాంతాల్లో భూ సమస్యలు, అక్రమ ఆక్రమణలు, అధిక వడ్డీ వ్యాపారం వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆవేదనను నేరుగా రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సోళ్ల బొజ్జి రెడ్డి రంపచోడవరం కేంద్రంలోని తన నివాసంలో గిరిజన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనేక మండలాల నుండి వచ్చిన గిరిజనులు తమ సమస్యలను వివరంగా తెలియజేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**అడ్డతీగల మండలం -- భూ సమస్యపై వినతి**

అడ్డతీగల మండలం గురగోమ్మి గ్రామానికి చెందిన గిరిజనులు తమ భూ సమస్యను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పరిధిలోని భూముల విషయంలో వివాదాలు నెలకొన్నాయని, తమ హక్కులు కాపాడేలా చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు.



**మారేడుమిల్లి మండలం -- అధిక వడ్డీ వ్యాపారంపై ఫిర్యాదు**

మారేడుమిల్లి మండలం చాట్లవాడ గ్రామ ప్రజలు గిరిజన ప్రాంతాల్లో చట్టాలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం జరుగుతోందని వివరించారు. చుట్టుపక్కల గ్రామాల్లో అమాయక గిరిజనులకు అధిక వడ్డీతో అప్పులు ఇచ్చి వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ దోపిడీని అరికట్టాలని కోరుతూ అర్జీ అందజేశారు.

**దేవీపట్నం మండలం -- ముంపుకు గురవుతున్న భూమి**

దేవీపట్నం మండలంలోని పెద్దనూరు, తున్నూరు పంచాయతీలకు సమీపంలోని కచ్చులూరు ప్రాంతంలో ఉన్న కొత్తపల్లి గ్రామం నెం.1లో సుమారు 1.25 ఎకరాల భూమి ముంపుకు గురవుతోందని గ్రామస్తులు తెలిపారు. భూమిపై తక్షణమే సర్వే నిర్వహించి తగిన నష్టపరిహారం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

**గంగవరం మండలం -- 1/70 చట్టం ఉల్లంఘన**

గంగవరం మండలం బయ్యానపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గిరిజన భూములను గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని గ్రామస్తులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టాన్ని ఉల్లంఘించి భూములు దక్కించుకున్నారని ఆరోపించారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

**భూ సమస్యలపై ఎక్కువ అర్జీలు**

ఈ సందర్భంగా అందిన దరఖాస్తులను పరిశీలించిన చైర్మన్, ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించిన అర్జీలే వచ్చినట్లు గుర్తించారు. గిరిజన ప్రాంతాల్లో భూముల అక్రమ ఆక్రమణలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

**సమస్యల పరిష్కారానికి చర్యలు**

రంపచోడవరం పరిధిలోని ఆరు మండలాల నుండి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు గుర్తించామని తెలిపారు. అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారం దిశగా తగిన చర్యలు తీసుకుంటామని సోళ్ల బొజ్జి రెడ్డి పేర్కొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేసిన అంకం రెడ్డి జమ్మిలు సైన్యం



**అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** అనకాపల్లి జిల్లా నాతవరం గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు క్రీస్తు శేషులు అంకం రెడ్డి జమ్మిలు సైన్యం సభ్యులు టెన్త్ చదువుతున్న పిల్లలకు అవసరమైన మెటీరియల్ ని పంపిణీ చేయడం జరిగింది . ఈ సందర్భం గా జమీలు సైన్యం సభ్యులు మాట్లాడుతూ జమ్మిలు ఆశయ సాధన కోసం చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన విద్యను అభ్యసించాలని మంచి విద్యావంతులుగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని మునుముందు ఆయన పేరిట మరికొన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్ల గాని రాణి జెడ్పిటిసి కాపారపు అప్పల నరస గ్రామ ఉపసర్పంచ్ కరక అప్పలరాజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావులు సంఘం అధ్యక్షులు పైల పోతురాజు అంకంరెడ్డి వెంకటరమణ కరక నానాజీ పోలిరెడ్డి చిన్నరాజు అంకంరెడ్డి రాంబాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా యువజన విభాగం కార్యదర్శి కంభేవంశీ సింగంపల్లి గణేష్ చింతకాయల రాము పోలిరెడ్డి అర్జున్ పోలిపర్తి రాంబాబు యువత తదితరులు పాల్గొన్నారు

## గొలుగొండలో గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం ఆందోళన

-ధరలు తగ్గించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిక




**గొలుగొండ మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** నిత్యం పెరుగుతున్న వంట గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా గొలుగొండ మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాలు మోపుతూ గ్యాస్ ధరలను పెంచడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను సాకుగా చూపిస్తూ ఆయిల్ కంపెనీలు గ్యాస్ ధరలను అమాంతం పెంచడం అన్యాయమని మండిపడ్డారు. గృహ వినియోగ గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా మార్కెట్లో గ్యాస్ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ బుక్ చేసినప్పటికీ ఓటీపీలు రాకపోవడం, సరఫరాలో జాప్యం జరుగుతున్న కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో గ్యాస్ ధరల పెంపు సామాన్యుడి నడ్డి విరుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివ, చిన్నబాబు, రాజు తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెన్నెల శ్రీ ని అభినందించిన హెచ్ఎం సంధ్య

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ లో ద్వితీయ స్థానం






**కొయ్యూరు అల్లూరి జిల్లా మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** మండల స్థాయిలో ఎస్ఎఫ్ఐ 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో వంతల వెన్నెల శ్రీ ద్వితీయ స్థానం సాధించింది. మండలంలో పి మాకవరం ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెన్నెల శ్రీ అనే బాలికకు ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లు ద్వితీయ స్థానం సాధించడంతో గురువారం ఐటీడీఏ డిడి సమక్షంలో సర్టిఫికెట్ అందజేశారు. దీంతో టీ మాకవరం ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 10వ తరగతి వార్షికోత్సవ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ సంధ్య వంతల వెన్నెల శ్రీ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సంధ్య మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ప్రతి ఒక్కరు పాల్గొని తమ ప్రతిభను కనబరిచినప్పుడే ఉన్నత శిఖరాలను అవరోధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు. పి శ్రీదేవి పద్మ, గోల్డ్ మేడం తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి



**క్రిష్ణగిరి మార్చి 13 (అఖండ భూమి న్యూస్)** పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని అక్షిత చారిటబుల్ ట్రస్ట్ సీఈవో అంజిస్వామి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్యాల, కటారి కొండ గ్రామాల్లో పదవ తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు అక్షిత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరీక్ష సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా అక్షిత చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ అంజి స్వామి మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు బాగా వ్రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశ్యంతో వారికి నగదు బహుమతులు ప్రకటించామన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాసి ఉత్తమ ఫలితాలు సాధించి నగదు బహుమతులు పొందాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెపల్లె రంగడు, ప్రాజెక్టు డైరెక్టర్ దేవేంద్ర గౌడ్, చిట్యాల బసవరాజు, ఆలంకొండ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు



**చిలకలూరిపేట మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి శ్రీశ్రీశ్రీ ఆత్రేయపురం మొల్లమాంబ జయంతి వేడుకలు శుక్రవారం నాడు పట్టణంలోని దివంగత బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిడమానూరు సాంబశివరావు లారీ ఆఫీసుకార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మెగాస్టార్ ఫ్యామిలీ వీరాభిమాని జనసైన నాయకులు స్టీల్ అంజి ,అద్దంకి వర ప్రసాద్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుమ్మరి సంఘం నాయకులతో కలసి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు అద్దంకి వర ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో మొల్లమాంబకి విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు. మహిళలు కూడా సాహిత్య రంగంలో గొప్ప కృషి చేయగలరని మొల్లమాంబ తమ రచనల ద్వారా నిరూపించారని అన్నారు. ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. ఇలాంటి మహనీయుల జీవితం యువతకు ఆదర్శమని, వారి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మొల్లమాంబ సేవలు తెలుగు భాషా అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని కొనియాడారు. ఆమె సాహిత్య కృషి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షులు కొలకలూరి అంజి, అద్దంకి వరప్రసాద్, నిడమానూరు వెంకట్ ,,అద్దంకి చెంచురామయ్య, నిడుజర్ల గోవిందు, రాజారపు నాగమల్లిఖార్జునరావు, రాజవరపు రాంబాబు, గొట్టం మస్తాన్, , కొండవీటి గోపి, తదితరులున్నారు.

## ప్రజా దర్బార్ అర్జిదారుల ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

వైపాలెం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్ బాబు




**యర్రగొండపాలెం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం రోజు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు . ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అర్జీదారుల నుండి తీసుకున్నారు.ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు ,మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి , కేసనపల్లి. మల్లికార్జున రావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాసవి కళ్యాణ మండపం లిఫ్టుకు విరాళం.



**మాచవరం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులో గల శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపం లిఫ్ట్ నిర్మాణానికి విరాళంగా ముందుకు వచ్చిన పిడుగురాళ్ల పట్టణ ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు గుండా రామారావు. ముందుకు వచ్చారు కళ్యాణమండపంలో జరుగుతున్న లిఫ్ట్ నిర్మాణ పనులకు స్పందించి రామారావు అతని ధర్మపత్ని స్వర్గీయ గుండా కన్యాకుమారి జ్ఞాపకార్థం లిఫ్ట నిర్మాణానికి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా విరాళం ప్రకటించిన రామారావు మరియు వారి కుమారులు అశోక్ బాబు ,రమేష్ కుమార్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ ఆర్యవైశ్య నాయకులు కనిగిరి శ్రీనివాసరావు మరియు పిడుగురాళ్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వనజ సాంబశివరావు కళ్యాణమండపం అధ్యక్ష కార్యదర్శులు గుడివాడ కుటుంబరావు, కొత్త కోటేశ్వరావు మరియు పిడుగురాళ్ల పట్టణ పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆరిలోవ అటవి ప్రాంతంలో గొలుగొండ పోలీసుల వాహన తనిఖీలు

-డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు -- పత్రాలు లేనివారికి జరిమానాలు

-ట్రాఫిక్ నిబంధనం తప్పనిసరి- ఎస్సై రామారావు హెచ్చరిక




**గొలుగొండ మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** గొలుగొండ మండలంలోని ఆరిలోవ అడవి ప్రాంతంలో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మల ఆదేశాల మేరకు ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అటవీ ప్రాంతం గుండా వెళ్లే వాహనాలపై నిఘా పెంచడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తనిఖీలలో భాగంగా మోటారు సైకిళ్లు, కార్లను నిలిపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, హెల్మెట్ వంటి నిబంధనలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించి హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రామారావు సూచించారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు తరచుగా కొనసాగుతాయని తెలిపారు.

# బి ఏ ఐ ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు

ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ మేనేజర్ సుష్మ నాయక పాల్గొన్నారు

**మార్కాపురం జిల్లా స్టాఫర్ మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్‌లో హెచ్ డి ఎఫ్ సి – – హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ పరివర్తన్ సహకారంతో, బి ఏ ఐ ఎఫ్ సంస్థ భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ శాఖల నుండి శ్రీనివాసరావు, మల్లు నాయక్ మండల విద్యాధికారి మరియు పొట్టయ్య, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ హాజరై ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ అభివృద్ధి మరియు రైతుల అభ్యున్నతికి కలిగే ప్రయోజనాల గురించి మాట్లాడారు. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ తరపున శ్రీకాంత్ సెకుబోయినా, క్లస్టర్ హెడ్, వినయ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్, మార్కాపురం హాజరై హెచ్ డి ఎఫ్ సి పరివర్తన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ అభివృద్ధికి అందిస్తున్న సహకారం గురించి వివరించి, ప్రాజెక్ట్ అమలుకు మార్గదర్శకత్వం ఇచ్చారు. బి ఏ ఐ ఎఫ్ సంస్థ తరపున బి. శివరుద్రప్ప, రీజినల్ డైరెక్టర్ కార్యక్రమంలో పాల్గొని ప్రాజెక్ట్ లక్ష్యాలు మరియు కార్యకలాపాల గురించి వివరించారు.




ముఖ్యంగా సహజ వనరుల నిర్వహణ విద్యాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి మరియు జీవనోపాధి అభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రాజెక్ట్‌లో అమలు చేయబడతాయని తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న గ్రామాల సర్పంచ్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామాల అభివృద్ధి కోసం ఈ ప్రాజెక్ట్‌కు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు కూడా పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి మరియు చిన్నపిల్లల విద్య, పోషణ కార్యక్రమాలకు ప్రాజెక్ట్ ద్వారా సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది రైతులు మరియు లబ్ధిదారులు పాల్గొని ప్రాజెక్ట్ కార్యకలాపాలపై ఆసక్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రాజెక్ట్ టీమ్ మరియు గ్రామ స్థాయి సిఆర్పిలు ముఖ్యమైన పాత్ర పోషించారు. ఈ ప్రాజెక్ట్ 01 అక్టోబర్ 2024 నుండి 30 సెప్టెంబర్ 2027 వరకు మొత్తం 36 నెలల పాటు అమలు చేయబడుతుంది. గ్రామీణ ప్రాంతాలలో సహజ వనరుల సంరక్షణ, జీవనోపాధి అభివృద్ధి, విద్యాభివృద్ధి మరియు నైపుణ్యాభివృద్ధి ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం. కార్యక్రమం చివరలో అన్ని భాగస్వాములు కలిసి ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# ఒకే అంబులెన్స్‌లో మూడు మృతదేహాల తరలింపు ఇదేనా గిరిజన అభివృద్ధి

**రంపచోడవరంనియోజకవర్గం, మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** పోలవరం జిల్లా గిరిజనుల అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో గిరిజనుల దుస్థితి మాత్రం మారలేదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మరణించిన గిరిజనుల మృతదేహాలను వారి స్వగ్రామాలకు గౌరవప్రదంగా తరలించే సదుపాయాలు కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన ముగ్గురు గిరిజనుల మృతదేహాలను వేర్వేరు మండలాలకు చెందినవైనా ఒకే అంబులెన్స్‌లో తరలించడం దారుణమని అన్నారు. సుమారు 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామాలకు మృతదేహాలను తీసుకెళ్లేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల కుటుంబ సభ్యులు తీవ్ర వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వివరాల ప్రకారం, దేవీపట్నం, కొయ్యూరు, గుర్తేడు మండలాలకు చెందిన ముగ్గురు గిరిజనులు మరణించారు. వీరిలో కొయ్యూరు మండలం కొమ్మనూరు గ్రామానికి చెందిన ఒక శిశువు, గుర్తేడు మండలం దుంపవలస గ్రామానికి చెందిన సోమాలమ్మకు జన్మించిన శిశువు, అలాగే దేవీపట్నం మండలం ధోనలంక గ్రామానికి చెందిన స్వర్ణలత (సుమారు 30 సంవత్సరాలు) మరణించారు. ఈ ముగ్గురు వేర్వేరు ప్రాంతాలకు చెందినవారైనా ఒకే అంబులెన్స్‌లో తరలించడం బాధాకర పరిస్థితిని బయటపెడుతోందని ఆయన అన్నారు. మహాప్రస్థానం అంబులెన్స్ ద్వారా రెండు మృతదేహాలను ముందుగా తరలిస్తుండగా, మరో మృతదేహం ఉందని ఆసుపత్రి నుంచి సమాచారం రావడంతో అంబులెన్స్



గంటల తరబడి నిలిపివేయాల్సి వచ్చినట్లు తెలిపారు. ఈ సమయంలో బాధిత కుటుంబ సభ్యులు తమ ప్రియమైన వారిని చివరిసారి చూసే అవకాశం కూడా లేక కన్నీటి పర్యంతం అయ్యారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని లోతా రామారావు తీవ్రంగా విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి పేరుతో ప్రకటనలు చేస్తూ గొప్పలు చెప్పుకోవడం కాకుండా, వారి జీవన పరిస్థితులను మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి అమానవీయ ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు, మృతదేహాల తరలింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రభుత్వానికి మరియు అధికారులకు హెచ్చరిక చేశారు. గిరిజనుల ప్రాణాలు,



వారి గౌరవం కాపాడటంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు.

# చిన్నారిగండి అడవుల్లో అక్రమ కలప దందా... చూస్తూ నిలుస్తున్న అటవీ శాఖ

**దేవీపట్నం, మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతాల్లో అడవులను కాపాడాల్సిన అటవీ శాఖ ఉన్నప్పటికీ, కొందరు అక్రమ వ్యాపారులు నిర్భయంగా చెట్లను నరికి అడవులను దోచుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రంపచోడవరం నియోజకవర్గంలోని దేవీపట్నం మండలం పరిధిలోని చిన్నారిగండి గ్రామ పరిసర ప్రాంతాలు అక్రమ కలప వ్యాపారులకు అడ్డాగా మారినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారం ప్రకారం చిన్నారిగండి పరిసర అడవుల్లో అనుమతి లేకుండా చెట్లను నరికి కలపను అక్రమంగా తరలిస్తున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా దశాబ్దాలుగా పెరిగిన వెదురు చెట్లు, ఇతర అటవీ వనరులను ఇష్టానుసారంగా నరికి బయటకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వెదురు చెట్లను కూడా నిర్భందం లేకుండా నరికి అక్రమంగా అమ్ముతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా దేవారం బీట్ పరిధిలోని అటవీ సిబ్బంది ఇప్పటికే పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగుతోందని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే వాస్తవ పరిస్థితులు చూస్తే అటవీ శాఖ చర్యలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. అడవులు



కాపాడాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ కలప వ్యాపారులు మరింత ధైర్యంగా అడవులను నరుకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన శాఖే మౌనం పాటిస్తే అడవుల పరిస్థితి భవిష్యత్తులో మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ దందాపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రంపచోడవరం డివిజన్ అటవీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి అక్రమంగా చెట్లు నరికే



వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఈ కార్యకలాపాలకు సహకరిస్తున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అటవీ శాఖ సిబ్బందిపై కూడా విచారణ జరిపి అవసరమైతే విధుల నుండి తొలగించాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు. అడవులు గిరిజనుల జీవనాధారం అని, అవే నాశనం అయితే గిరిజనుల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం మరియు అటవీ శాఖ వెంటనే స్పందించి చిన్నారిగండి పరిసర అడవులను అక్రమ దందా నుండి రక్షించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

# అన్నదాత సుఖీభవ పి.యం కిసాన్ (రైతన్నా మీకోసం)






**యర్రగొండపాలెం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ -- పి.యం కిసాన్ 2025--2026 మూడవ విడత పంపిణీ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు లిప్రకాశం జిల్లా డీసీఎంస్ చైర్మన్ శ్యామల కాశీ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూరైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నారని, రైతు కుటుంబాల ఆర్థిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వ పి.యం కిసాన్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. ఈ మూడవ విడతలో మాత్రమే యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 39,274 మంది రైతు కుటుంబాలకు మొత్తం ?22 కోట్ల 45 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో నేరుగా జమ కావడం ప్రభుత్వానికి రైతులపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో చంద్రబాబు నాయుడు నాయకత్వం ప్రత్యేకమని ఎరిక్షన్ బాబు అన్నారు. ఒకటో తేది ఆదివారం వచ్చినా ముందురోజే పేదలందరికీ పెన్షన్లు ఇంటింటికి అందించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని, మహిళల కోసం ఉచిత గ్యాస్ సిలిండర్లు, విద్యార్థుల కోసం "తల్లికి వందనం" వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అలాగే ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత రైతాంగానికి జీవనాడిగా నిలిచే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు మరియు త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజల ఆశలు, రైతుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తున్న నాయకత్వం నారా చంద్రబాబు నాయుడు దేనని.లి రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు.

## పేదరికంతో మరణించిన గీత కార్మికుడి కుటుంబానికి కుట్టు మిషన్ అందజేసిన కాన....



**వలిగొండ మార్చి 13.(అఖండభూమి న్యూస్):.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎం తుర్కపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పల్సం స్వామి గౌడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించారు. స్వామికి ముగ్గురు పిల్లలు చిన్న వారు కావడంతో వారి కుటుంబ పరిస్థితిని స్థానిక గౌడ సంఘం నాయకులు, కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి పల్సం స్వామి కోరిక మేరకు తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోలగాని జయరాములు, జిల్లా అధ్యక్షులు రాగిర్ కృష్ణయ్యలు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ప్రతినిధి నాతి గణేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ వారి సహకారంతో స్వామి గౌడ్ కుటుంబ సభ్యులకు పోషణ కోసం కుట్టుమిషన్ ను శుక్రవారం నాడు స్వామి నివాసానికి వెళ్లి, అందించారు. ఈ కార్యక్రమంలో గోకారం మాజీ సర్పంచ్, కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దేల రాజయ్య, ఎం తుర్కపల్లి గ్రామ సొసైటీ అధ్యక్షులు పల్సం మచ్చ గిరి, వలిగొండ మండల ఉపాధ్యక్షులు, వలిగొండ సొసైటీ అధ్యక్షులు కొండూరు అంజయ్య, ఎక్కడ సోషల్ మీడియా నాయకులు ఇవ్వగాని శ్రీకాంత్, గీత కార్మికులు, మృతుని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు....

## ఈ సిగరెట్ల విక్రయం భారత చట్టాల ప్రకారం నేరం



**ఆలేరు మార్చి 13. (అఖండభూమి న్యూస్):** ఈ సిగరెట్ల విక్రయం, రవాణా, నిల్వలు భారత చట్టాల ప్రకారం నేరం. ఎవరైనా ఇలాంటి పనులకు పాల్పడితే ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, ఒక లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించి, 5 లక్షల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం లేకపోలేదు. యువత వీటి బారిన పడకుండా తల్లిదండ్రులే బాధ్యత వహించాలి. తమ పిల్లల దగ్గర పెన్ను లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఏమైనా ఉన్నాయా, లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలి. ఈ సిగరెట్లు ప్రధానంగా మలేషియా, దుబాయ్, థాయిలాండ్ వంటి దేశాల నుండి మన దేశానికి దిగుమతి అవుతున్నాయని అధికారుల అంచనా. వీటిని ఢిల్లీ, ముంబై, బెంగళూరు మీదుగా హైదరాబాద్కు రవాణా అవుతున్నాయని అధికారుల నిర్ధారణ. ఈ సిగరెట్ల విషయంలో చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉద్దేశించేది లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు....

# నేడే జాతీయ లోక్ అదాలత్

న్యాయమూర్తి టి ప్రవళిక




**మాచవరం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** పిడుగురాళ్ల పట్టణంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు నేడు మార్చి 14న మండల న్యాయ సేవాధికార సంస్థ, పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో స్థానిక సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా సివిల్ కోర్టు జడ్జి ప్రవళిక తెలిపారు. పిడుగురాళ్ల కోర్టు పరిధిలోనే కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రీ లిటిగేషన్ కేసులు ( ముందస్తు వాయిద్యములు) ఎదుట కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చు అని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు సమయము, ధనము ఆదా అవుతుందని తెలియజేశారు. మార్చి 14న ( రెండవ శనివారం) పిడుగురాళ్ల సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ జరుగును కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవలసినదిగా కోరారు.

## అయ్యన్నపాత్రుడిని విమర్శించేంత నైతికహక్కు ఉమాశంకర్ గణేష్‌కు లేదు

-గొలుగొండ మండలానికి భారీగా నిధులు తీసుకొచ్చిన ఘనత అయ్యన్నపాత్రుడిదే

-తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని టిడిపి యువనాయకులు గెడ్డం ఆనంద్ హెచ్చరిక



**గొలుగొండ మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** గత ఎన్నికల ముందు ఓటర్లను మభ్యపెట్టేందుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తూతూమంత్రంగా పాతమల్లంపేటలో వేసిన నాసిరకం రోడ్లే ఆయన పనితీరుకు నిదర్శనమని శుక్రవారం విలేకరుల సమావేశంలో గొలుగొండ మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గెడ్డం ఆనంద్ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికలకు వారం రోజుల ముందు కేవలం ఓట్ల కోసమే ఎలాంటి నాణ్యత లేని రోడ్లు వేసి ప్రజలను మోసం చేశారని ఆయన మండిపడ్డారు. సాలిక మల్లవరం వద్ద రంగురాళ్లను ఎత్తుకెళ్లి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన చరిత్ర ఉన్న ఉమాశంకర్ గణేష్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఈ 24 నెలల కాలంలోనే అయ్యన్నపాత్రుడు గొలుగొండ మండలానికి రూ. 100 కోట్ల నిధులు మంజూరు చేశారని, ఒక్క పాత మల్లంపేట పంచాయతీకే రూ. 5.70 కోట్లు కేటాయించి ప్రతి పల్లెకు సిమెంట్ రోడ్లు నిర్మించారని ఆనంద్ వివరించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 35 కోట్లు, అలాగే మొత్తం నియోజకవర్గానికి రూ. 415 కోట్లు నిధులు తీసుకువచ్చిన ఘనత అయ్యన్నపాత్రుడికే దక్కుతుందన్నారు. నర్సీపట్నం చెరువు వద్ద 108 అడుగుల శివపార్వతుల విగ్రహాన్ని ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఎంతో అద్భుతంగా నిర్మిస్తున్నారని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మీరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలో గుడి, బడి, ఆసుపత్రి ఇలా ఏదైనా అభివృద్ధి జరగాలంటే అది కేవలం అయ్యన్నపాత్రుడి వల్లే సాధ్యమని, ఆయనపై మరోసారి అసత్య విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని గెడ్డం ఆనంద్ హెచ్చరించారు.

## తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ ఎందరికో ఆదర్శం. యువ నాయకులు నిఖిల్

**మాచవరం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** తెలుగుజాతి గర్వించేలా తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ అని గురజాల నియోజకవర్గం టిడిపి యువ నాయకులు యరపతినేని నిఖిల్ అన్నారు మన్యం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ లో మొల్లమాంబ 586వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఎన్నో కవితలు రాసి ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచిన మహిళ ఆమె అని కొనియాడారు అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు నిఖిల్ ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కూటమి నాయకులు పాల్గొన్నారు



## పెనుమూడి చెక్ పోస్ట్ దగ్గర నుండి భారీ ర్యాలీ



పీటా నాగ మోహనకృష్ణ.


**( రేపల్లె నియోజకవర్గ ఇంచార్జి: సిహెచ్ రాంబాబు. చెరుకుపల్లి, మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** జగనన్న ఆశీస్సులతోపీటా నాగ కృష్ణమోహన్ గారి ఆగమనానికి రేపల్లెకు ఇదే మా యొక్క సాదర ఆహ్వానం శుక్రవారం మధ్యాహ్నం 3 గం లకు పెనుముడి చెక్ పోస్ట్ దగ్గర మొదలవుతున్న భారీ ర్యాలీకి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి మన నాయకుడు పీటా నాగ మోహన్ కృష్ణ తోడుగా మేమున్నాము అన్నట్లుగా భావించి రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలంలోని ప్రతి గ్రామం నుండి రాష్ట్ర,జిల్లా,మండల,గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు,అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరడమైనది, చెరుకుపల్లి మండల అధ్యక్షులు. దుండి వెంకటరామిరెడ్డి.

## పీఎం కిసాన్ ద్వారా రైతులకు ఆర్థిక భరోసా

అనకాపల్లి జిల్లా మార్కెట్ యార్డ్ డైరెక్టర్

గొ శీ ప సత్యనారాయణ

**అనకాపల్లి జిల్లా నాతవరం మండలంమార్చి 13 (అఖండ భూమి న్యూస్):** రైతులు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో గౌరవ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమాన్ నిధి పథకం కింద రైతులకు గొప్ప ఆర్థిక భరోసా నిస్తుందని అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గొశీ ప ఈ పథకం ద్వారా సంవత్సరానికి 6000 నేరుగా జమ చేస్తూ భరోసా కల్పిస్తుందని దీనిని ప్రతి ఒక్క రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని ఈ కేవైసీ మరియు సాంకేతిక లోపాలను పర్యవేక్షణ చేసుకొని ఉండాలని ఆయన కోరాడు



## చిదంబర రామలింగేశ్వర స్వామి వారికి సంప్రోక్షణ



**మాచవరం మార్చి 13 (అఖండ భూమి న్యూస్):** మాచవరం మండలంలోని వేమవరం గ్రామంలో అతి పురాతనమైన శ్రీ పార్వతి సమేత చిదంబర రామలింగేశ్వర స్వామి వారికి శుక్రవారం సంప్రోక్షణ కార్యక్రమము జానపాటి సీతారామశర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణోత్తములచే నిర్వహించారు ఈ అలయం పునః నిర్మాణలో భాగంలో దేవతా మూర్తులు ను బాల ఆలయంలోకి మార్చి నిత్య దూప దీప నైవేద్యం నిర్వహిస్తూన్నారు అనివార్య కారణాలవల్ల స్వామి వారి నిత్య కైంకర్యాలు అవరోధాలు కలగటం వల్లన సంప్రోక్షణ అను క్రతువుని పవిత్ర జలాలతో మంత్రోచ్చారణలతో అలయం దేవతామూర్తులను మహా సంప్రోక్షణతో శుద్ది చేసి మూలమూర్తి ప్రత్యేక పూజలు చేశామన్నారు ఈ కార్యక్రమంలో వైదిక బ్రాహ్మలు నరసింహమూర్తి శర్మ భార్గవ్ రాకేష్ శర్మ దేవదాయ ధర్మదాయశాఖ గ్రూప్ ఈవో సుబ్బారెడ్డి గ్రామపెద్దలు గోళ్ళ గంగాధర్ కామిశెట్టి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు

## కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న గవర్నర్




**యాదగిరిగుట్ట మార్చి 13. (అఖండభూమి న్యూస్):** ఇటీవల రాష్ట్ర గవర్నర్గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ శివ ప్రతాప్ శుక్ల శుక్రవారం నాడు తెలంగాణ తిరుపతి గా పేరుగాంచిన శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి పుణ్యక్షేత్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, రెవిన్యూ అధర్ ఆఫ్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డిలు గవర్నర్కు పూల మొక్కలను బహుకరించి, స్వాగతం పలికారు. ముందుగా రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి భవాని శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సాంప్రదాయంతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజస్తంభం వద్ద మొక్కి స్వామి వారి అంతరాలయంలో అర్చన పూజలు చేశారు. కార్యనిర్వహణ అధికారి స్వామి వారి మెమొంటోలను గవర్నర్కు అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామివారి ప్రసాదాన్ని గవర్నర్ దంపతులకు అందజేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి గవర్నర్ దంపతులు అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టోల్గేట్ అధికారుల వైఖరిని తప్పు పట్టిన ఎమ్మెల్సీ చింతపండు



**బీబీనగర్ మార్చి 13. (అఖండభూమి న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా నుండి వెళ్లే జాతీయ రహదారి 163 పై గల టోల్గేట్ సమీపంలో పేదల జీవనాధారమైన టిఫిన్ కేంద్రాలను టోల్గేట్ అధికారులు అక్రమంగా కూలగొట్టడాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న తీవ్రంగా తప్పుపట్టారు. విషయం తెలుసుకున్న ఆయన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా టోల్గేట్ అధికారులను అక్కడికి పిలిపించి, పేదల ఉపాధిని నాశనం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అనేక సంవత్సరాలుగా టిఫిన్ కేంద్రాలను నిర్వహిస్తూ, తమ కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవనోపాధిని ఒక్కసారిగా పూల కొట్టడం అన్యాయం అని మంది పడ్డారు. టిఫిన్ కేంద్రాలను నిర్వహిస్తున్న బాధితులతో మాట్లాడి, వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పేదల కడుపు కొట్టే చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. పేదలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. వెంటనే టోల్గేట్ అధికారులతో మాట్లాడి టిఫిన్ కేంద్రాలు తిరిగి నిర్వహించుకునేలా చూడాలని, వారిని ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. వెంటనే టిఫిన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోండి, నీకు నేనున్నా, మిమ్మల్ని ఇబ్బంది పెడితే మళ్లీ వస్తా అని వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా టిఫిన్ కేంద్రాల నిర్వహకులు ఎమ్మెల్సీ నవీన్ కు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య తెలిసిన వెంటనే స్పందించి, తమకు అండగా నిలబడడం గొప్ప విషయమని అన్నారు.

## యుద్ధం ప్రభావంతో పెరగనున్న వాటర్ బాటిల్ ధరలు



**హైదరాబాద్ మార్చి 13. (అఖండభూమి న్యూస్):** ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో పార్టీల తయారీకి వాడే ప్లాస్టిక్ (పాలిమర్) ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రాయిటర్స్ నివేదిక ప్రకారం వాటర్ బాటిల్ల తయారులో కీలకమైన పాలిమర్ ధర ఏకంగా 50% పెరిగి కిలోకి 170 రూపాయలకు చేరింది. కేవలం వాటర్ బాటిల్ బాడీ మాత్రమే కాదు పైన ఉండే మూత ధర కూడా 0,45 కు పెరిగింది. దీనికి తోడు ప్యాకింగ్ చేసే కార్టన్ బాక్సులు, లేబుళ్లు, టెపుల ధరలు కూడా విపరీతంగా పెరగడంతో త్వరలో వాటర్ బాటిల్ల రేట్లు సైతం పెరిగే అవకాశం ఉందని పలువురు అనుకుంటున్నారు....

## నిండు గర్భిణీని గెంటివేసిన దావఖాన సిబ్బంది



**హైదరాబాద్ మార్చి 13 (అఖండభూమి న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా దవాఖానకు వచ్చిన నిండు గర్భిణికి చేదు అనుభవం ఎదురైంది. దవాఖానకు వచ్చిన ఆమెకు సేవలందించాల్సింది పోయి, లోపలికి రానివ్వకుండా నర్సింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. ఇక్కడ వైద్యురాలు లేదని, సిరిసిల్లకు వెళ్లాలని బయటి నుంచి బయటికే వెళ్లగొట్టారు. బాధితురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగికి చెందిన రాచకొండ గౌతమి నిండు గర్భిణి. ఆమెకు ఇబ్బందిగా ఉండటంతో తల్లి అంజమ్మతో కలిసి గురువారం రాత్రి 8గంట ప్రాంతంలో 108 వాహనంలో వేములవాడ ఏరియా దవాఖానకు చేరుకున్నారు. గర్భిణిని తీసుకువచ్చామని 108 సిబ్బంది నర్సుకు తెలుపగా, ఇక్కడ వైద్యురాలు అందుబాటులో లేదని, తాము తీసుకోబోమని లోనికి రాకుండా అడ్డుకున్నారు. ఇబ్బందిగా ఉందని, కొంచెం పరీక్షలు చేసి అయిన రెఫర్ చేయండి అంటూ కోరిన ఆమె వినకుండా బయటనే అడ్డుకొని పంపించడం ప్రస్తుతం చర్చనీయాంశం అయ్యింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు....

## ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ముజీబ్ నియామకం



**రామన్నపేట మార్చి 13. (అఖండభూమి న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఎండి ముజీబ్ కు రాష్ట్రస్థాయిలో కీలక పదవి దక్కింది. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐఎన్టీయూసీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ముజీబ్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ ఏ ఎల్) లో ఉద్యోగిగా కొనసాగుతూనే, కార్మిక సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. గత కొన్ని నీళ్లుగా కార్మిక సంఘం బలోపేతానికి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం ఆయనను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గౌరవప్రదమైన బాధ్యతలను అప్పగించిన ఐ ఎన్ టి సి జాతీయ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ జి సంజీవరెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్డి చంద్రశేఖర్, అదిల్ షరీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంబి విజయ్ కుమార్ యాదవ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐఎన్టియుసి బలోపేతానికి కృషి చేస్తూ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముజీబ్ నియమకాన్ని పలువురు కార్మిక సంఘం నాయకులు హర్షించారు.

## ప్రజల కోసం అహర్నిశలు పనిచేసిన రాములు మరణం బాధాకరం



బిఆర్ఎస్ నాయకులు....

**ఇబ్రహీంపట్నం మార్చి 13. (అఖండభూమి న్యూస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు మరణం పేద ప్రజలకు తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి క్యానమ మల్లేశం, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిలు అన్నారు. రాములు మరణ వార్త విన్నవారు హుటాహుటిన ఆయన నివాసానికి వెళ్లి, భౌతిక దేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కొండిగారి రాములు నియోజకవర్గ ఎమ్మెల్యేగా సమయంలో నిత్యం ప్రజలతో మమేకమవుతూ సాధారణ జీవితం గడిపే వారని గుర్తు చేశారు. ప్రజల ఆశలకు, ఆశయాలకు అనుకూలంగా తన ఎమ్మెల్యే పదవిని ఉపయోగించిన ఆయన ఎందరో వర్తమాన ఎమ్మెల్యేలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రాముడు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ సభను విజయవంతం చేయండి

బెల్లంపల్లి కొత్త బస్టాండ్ దగ్గర ఎంసిపిఐయు అమరవీరుల స్థూపం వద్ద వాల్ పోస్టర్లను విడుదల చేసిన ఎంసీపీఐ(యూ)పార్టీ నాయకులు



**బెల్లంపల్లి మార్చి 13(అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు,మాజీ శాసనసభ్యులు,ఎంసీజిల్లా పీఐయు పార్టీ వ్యవస్థాపకులు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది.అనంతరం జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ...కామ్రేడ్ ఓంకార్ తన ఆరున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఏ శక్తులకు లొంగ కుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడు నిత్యం ప్రజల కోసం జీవించిన ఆయనను శత్రువులు హత్య దాడులు చేసిన చావుకు తలవంచని మృత్యుంజయుడనీ ప్రజా సమస్యలపై చట్టసభలలో ప్రజాగణం వినిపించిన అసెంబ్లీ టైగర్ గా తెలుగు రాష్ట్రాల ప్రజల మెచ్చిన నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ అని 1926 మే12 నేటి సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం,ఏపూరులో మద్ది కాయల రామయ్య,అనంతలక్ష్మి దంపతులకు మొదటి సంతానంగా జన్మించారని,ఏపూరులో నాలుగో తరగతి వరకు చదివి ఆ తర్వాత పెద్దగా చదువుకోలేదని నాటి రాజకీయ సామాజిక పరిస్థితులు ఓంకార్ తిరుగుబాటుకు సాయుధ పోరాటానికి దారితీసిందని ఆ దుర్మార్గపు పాలన ఓంకార్ చేత తుపాకీ పట్టించింది కూడా 1946 నుండి 1951 వరకు విరామం ఎరుగక జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయుధం చేత పట్టి ధరలపై భూస్వాములపై నిజాం రజాకారులపై తిరగబడి పోరాడినందుకుగాను నాటి నిజాం ప్రభుత్వము కామ్రేడ్ ఓంకార్ తలకు వెలకట్టిందని,కామ్రేడ్ ఓంకార్ ఆదర్శవంతమైన జీవితాన్ని,పోరాటా స్మృతులను స్మరిస్తూ 2025 మే 12 నుండి 2026 మే 12 వరకు సంవత్సర కాలము పాటు కార్యక్రమాలను వివిధ రూపాలలో ఎంసిపిఐ(యూ)పార్టీ నిర్వహిస్తుందని ఈ కార్యక్రమంలో భాగంగా 2026 మార్చి 17న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో చట్టసభలో ఓంకారి పాత్ర అనే అంశంపై రాష్ట్రస్థాయి సభను నిర్వహించడం జరుగుతుందని,ఈ సభ జయప్రదానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాతంత్ర వాదులు,వివిధ రాజకీయ వర్గాలు,కవులు,కళాకారులు,మహిళలు, యువజనులు విద్యార్థులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ( ఐక్య,) ఎంసిపిఐ (యూ)మంచిర్యాల జిల్లా కమిటీ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యూ)పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి,ఆరెపల్లి రమేష్,తొగరి రాహుల్,మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు కంపెల్లి రాధా, సబ్బని రాజశేఖర్,ఖమ్మం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

# బెల్లంపల్లి మున్సిపల్ లో ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్



**బెల్లంపల్లి మార్చి 13(అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో తెలంగాణ రాష్ట్రము ఏర్పాటుఐన తరువాత మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలోని 34వ వార్డ్ లో ప్రజలు నడిచేరహదారులు మూసివేసి అక్రమనిర్మాణలు అనుమతిలేకుండా భవన నిర్మాణం బెల్లంపల్లి పట్టణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన కాంట్రాక్ట్ బస్తీలో నేడు సింగరేణి సంస్థ షాపులవాళ్లు మా కాంట్రాక్ట్ బస్తీలో కి చొచ్చుకొచ్చి ప్రజలు నడిచేరహదారులు కబ్జాచేయడం,దీనికి కొందరు అవినీతి నాయకులు మద్దతుపై ఆవేదనతో బెల్లంపల్లిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఆంధ్రబ్యాంక్ లైన్ లోని అండర్ డ్రైనేజీ పైన భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చిన విషయంపై ఇచ్చిన విజ్ఞప్తిని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ విచారణ జరిపి ఏడాది ఐన సందర్భంగా ఇదే నెల 2 తారీఖున మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు బెల్లంపల్లిలో మాస్టార్ ప్లాన్ ద్వారా బెల్లంపల్లి అభివృద్ధికై ఇచ్చిన విజ్ఞప్తిని జిల్లా కలెక్టర్ సబ్ కలెక్టర్ కి పంపడంపై బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికై 34వార్డ్ లో ప్రజలునడిచే రహదారులు అక్రమనపై కాంట్రాక్ట్ బస్తీలో ప్రజలునడిచే రహదారులు స్వాహాచేసి నిర్మాణల వల్ల కాంట్రాక్ట్ బస్తీ ప్రజలు ఇరుకురోడ్లతో ఇబ్బందులు పై బెల్లంపల్లి మున్సిపాలిటీ ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాలని,బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ బిసి నాయకులు కొలిపాక శ్రీనివాస్ అలాగే కాంట్రాక్టు బస్తీ ప్రజలు గర్రేపల్లి రాజు,గడ్డిమహేష్,సంజయ్ శర్మ, బాల సాయి,పసుపులేటి రాజేష్,కొలిపాక కిరణ్,తదితరులు క్లాత్ రెడీమేడ్ అసోసియేషన్ కార్యదర్శి మంతెన భాస్కర్,పాల్గొన్నారు.బెల్లంపల్లి కాంగ్రెసు పార్టీ నాయకులు రేవంత్ రెడ్డిసైన్యం ప్రధానకార్యదర్శి కొలి పాక శ్రీనివాస్ మాట్లాడుతూ.బెల్లంపల్లిలోమాస్టారుప్లాన్ ద్వారాపట్టణ.ప్రగతి కై అనుమతిలేకుండా అక్రమంగానిర్మాణం కూల్చివేతల పై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద అండర్ డ్రైనేజీకి ఇంటి నెంబర్ వల్ల అక్రమనిర్మాణం కి అనుమతిఇచ్చిన మున్సిపల్ అధికారుల పై తెలంగాణ చీఫ్ మున్సిపల్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి మాస్టర్ ప్లాన్ ద్వారా బెల్లంపల్లిని ఫ్యూచర్ సిటీ గా చేయాలని రాష్ట్రముఖ్యమంత్రి తెలంగాణ మున్సిపల్ ఇంచార్జీ మినిస్టర్,రేవంత్ కీ కి మధ్యమం ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు.బెల్లంపల్లిసబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కాంట్రాక్ట్ బస్తీలో పర్యటనచేయాలని కాంట్రాక్ట్ బస్తీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నరు...

# చేనేత పరిరక్షణ కోసం సహకరించాలి

ఆర్థిక శాఖ మంత్రిని కోరిన చేనేత కార్మిక సంఘం నేతలు...



**హైదరాబాద్ మార్చి 13. (అఖండభూమి న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నాడు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, ఉపాధ్యక్షులు వర్కాల చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి లతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం నాడు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, చేనేత పరిశ్రమకు రెండు వేల కోట్ల రూపాయలు, పవర్లు (మరమగ్గాలకు) రెండు వేల కోట్ల రూపాయలను వేరువేరుగా కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పథకంలో కార్మికునికి 1200 రూపాయలు, అనుబంధ కార్మికునికి ఎనిమిది వందల రూపాయలు రికరింగ్ డిపాజిట్ చేస్తే ప్రభుత్వం 2400o1600 రూపాయలు డిపాజిట్ చేస్తుందని గుర్తు చేశారు. చేనేత కార్మికులు బ్యాంకులలో రికరింగ్ డిపాజిట్ చేసిన, ప్రభుత్వం రెండు నెలలే డిపాజిట్ చేసి గత తొమ్మిది నెలల నుండి డిపాజిట్ చేయడం లేదని ఆరోపించారు. చేనేత భరోసా పథకం అమలు చేస్తామని ప్రకటించి రెండు సంవత్సరాలు అవుతున్న అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. జియో టాగ్ ఉన్న చేనేత కార్మికులకు నెలకు 2000 రూపాయలు, అనుబంధ కార్మికుడికి 500 రూపాయల చొప్పున ఇద్దరి ఖాతాలలో జమ చేయాల్సి ఉన్న, వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నేతన్న బీమా పథకంలో 59 సంవత్సరాల లోపల ఉన్నవారికి ఇన్సూరెన్స్ కంపెనీలు ఇవ్వగా, 59 సంవత్సరాలు నిండిన వారికి టెస్కో (టిజిఎస్సిఒ) ద్వారా ఎక్స్గ్రేషియా ఇస్తున్నారని తెలిపారు. నెలలు, సంవత్సరం దాటిన మరణించిన చేనేత కార్మికుల కుటుంబాలకు నేటికీ ఎక్సిపేషియా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం బడ్జెట్లో కేవలం 200 కోట్ల రూపాయలు కేటాయించడం వలన హ్యాండ్లూమ్, టెక్స్టైల్స్ దగ్గర డబ్బులు లేకపోవడం వలన పథకాలు అమలు జరగడంలేదని అన్నారు. 2026, 27 వార్షిక బడ్జెట్లో చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం 2000 రూపాయలు, టెక్స్టైల్స్ కు 2000 రూపాయలను వేరువేరుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. హ్యాండ్ టెక్స్టైల్స్ లో ఉన్న పథకాలు కొనసాగించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు...

# ఇకపై రాష్ట్ర స్థాయిలో ఎస్సై పోస్టులు..

జోనల్ వ్యవస్థను రద్దు చేసే యోచనలో ప్రభుత్వం...


పోలీసు సర్వీస్ రూల్స్లో మార్పులు చేస్తూ ప్రతిపాదనలు....

క్యాబినెట్ సబ్ కమిటీకి సిఫార్సు చేసిన ప్రభుత్వం...



**హైదరాబాద్ మార్చి 13. (అఖండభూమి న్యూస్):** పోలీసుల పదోన్నతులకు సంబంధించిన వివాదానికి తెర దించేందుకు పోలీసు ఉన్నత అధికారులు నడుం బిగించారు. జోన్లతో సంబంధం లేకుండా ఎస్సై పోస్టులను రాష్ట్రస్థాయిగా మార్చబోతున్నారు. ఈ మేరకు పోలీసు సర్వీస్ రూల్స్లో మార్పులు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలపై చర్చించేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీకి సిఫార్సు చేసింది. అక్కడ కూడా ఆమోదం పొందితే ఇకమీదట ఎస్సై పోస్టు రాష్ట్రస్థాయిగా మారనుంది. విద్య, ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో అప్పటి ఉమ్మడి రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించిన సంగతి తెలిసిందే. ఇందులో ఎస్సై పోస్టును జోనల్ స్థాయికి కేటాయించారు. అంటే ఏ జోన్కు ఎంపికైనవారు ఆ జోన్లోనే పనిచేయాలి. అక్కడే పదోన్నతి పొందాలి. దీంతో ఒకే బ్యాచ్లో ఎస్సైలుగా చేరినప్పటికీ ఆయా జోన్లలో ఉన్న ఖాళీల కారణంగా కొందరికి ముందుగా పదోన్నతులు వస్తున్నాయి. అంటే ఒకే బ్యాచ్కి చెందినప్పటికీ కొందరు సీఐలుగా ఉంటే మరికొందరు డీఎస్పీ, అదనపు ఎస్పీలుగా పదోన్నతులు పొందుతున్నారు. ఉదాహరణకు ఆరో జోన్లో ఉన్న హైదరాబాద్లో ఎక్కువమంది సిబ్బంది అవసరం ఉండేది. ఇక్కడ ఎస్సైలుగా ఎంపికైనవారికి ముందుగా పదోన్నతులు వచ్చేవి. డీఎస్పీ రాష్ట్రస్థాయి పోస్టు. అన్ని జోన్ల నుంచి ఎస్సైలు సీఐలుగా, సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి పొందినప్పటికీ హైదరాబాద్ ప్రాంతంవారు ముందుగానే పదోన్నతి పొందడంతో డీఎస్పీ సీనియార్టీ జాబితాలోనూ వీరే ముందుంటారు. హైదరాబాద్లో 2012 బ్యాచ్ ఎస్సైలకు పదోన్నతులు వచ్చిన చాలాకాలానికి వరంగల్లో 2009 బ్యాచ్ వారికి పదోన్నతులు వచ్చాయి. దాంతో 2009 బ్యాచ్ వరంగల్ అభ్యర్థులు చాలాకాలం ఆందోళన చేశారు. ప్రతి బ్యాచ్ పదోన్నతుల్లోనూ ఇదే వివాదం కొనసాగేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్, వరంగల్ల పేరుతో రెండు ఫ్రీజోన్లు చేశారు. స్వల్ప మార్పులు మినహా గతంలో ఉన్న జోన్-5 వరంగల్ అయితే, జోన్-6 హైదరాబాద్. ఇప్పుడు కూడా ఖాళీలు ఎక్కడ ఎక్కువగా ఉంటే పదోన్నతులూ అక్కడే ఎక్కువ ఇస్తారు. పదోన్నతుల్లో ఒక్కసారి తేడా వస్తే సర్వీసులో ఉన్నంతకాలం అది కొనసాగుతూనే ఉంటుందని, ఒకే బ్యాచ్కి చెందినప్పటికీ తమ హోదా తక్కువ వల్ల తోటివారికే సెల్యూట్ కొట్టాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు తెలంగాణలో మాత్రమే ఇలాంటి పరిస్థితి ఉంది. చాలా రాష్ట్రాల్లో కానిస్టేబుల్ పోస్టులు కూడా రాష్ట్రస్థాయిలోనే ఉంటాయి. అలాంటప్పుడు పదోన్నతులు, బదిలీలు కూడా రాష్ట్రస్థాయిలోనే జరుగుతాయి. మన దగ్గర జోనల్ వ్యవస్థ కారణంగా బదిలీలు, పదోన్నతుల విషయంలో కొంత గందరగోళం కొనసాగుతోంది. దీన్ని చక్కదిద్దే ఉద్దేశంతోనే ఎస్సై పోస్టును రాష్ట్రస్థాయికి ప్రతిపాదిస్తూ పోలీసు సర్వీస్ రూల్స్లో సవరణలు చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ దీనికి ఆమోదించినట్లయితే ఆ తర్వాత జరిగే నియామకాల్లో ఎంపికైనవారికి ఇలాంటి సమస్యలు తొలగిపోతాయి.....

## బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న క్యామ...



**బీబీనగర్ మార్చి 13. (అఖండభూమి న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని ఎర్రెంజీ గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామివారి దేవస్థాన బ్రహ్మోత్సవాలలో శుక్రవారం నాడు బిఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి క్యామ మల్లేశం పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు...

## స్వచ్ఛమైన త్రాగునీరును అందించేందుకు కృషి

ఎన్నికల హామీని నెరవేర్చిన మున్సిపల్ వైస్ చైర్మన్ రమ్య...



**యాదగిరిగుట్ట మార్చి 13. (అఖండభూమి న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు పరిధిలో గల ఎస్సీ కాలనీలో మరమ్మత్తులకు నోచుకోని నీటి శుద్ధి యంత్రాన్ని శుక్రవారం నాడు మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగె రమ్య రామచందర్ నీటి శుద్ధియంత్ర మరమ్మత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలకు చెందినవారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు...

